సాక్షి నల్లగొండ

గురువారం ; 5 ; అక్టోబర్ ; 2023

ఓటర్ల తుదిజాబితా విడుదల



నల్లగొండ : ఓటర్ల తుదిజాబితా విడుదలైంది. జిల్లాలో 14,26,480 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఆగస్టు నెలలో ప్రకటించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లా ఓటర్లు మొత్తం 13,84,525 మంది ఉండగా.. కొత్తగా 41,955 మంది ఓటర్లు పెరిగారు. ఓటరు జాబితాను జిల్లా ఎన్నిక జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో నోటీసు బోర్డుపై ఉంచారు.

పెరిగిన ఓటర్లు ఇలా..

దేవరకొండ 10252, నాగార్జునసాగర్ 5149, మిర్యాలగూడ 6930, నల్లగొండ 7722, మునుగోడు 5248, నకిరేకల్ 6654 మంది ఓటర్ల పెరిగారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

అర్హతలు కలిగి ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకొని వారికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ గడువు 10 రోజుల ముందు వరకు ఓటు హక్కు కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

బ్యాంక్ ఆఫీసర్ పరీక్షకు ఉచిత శిక్షణ

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో బ్యాంక్ ప్రొబెషనరీ ఆఫీసర్ పరీక్ష కోసం వంద మంది మైనారిటీ అభ్యర్థులకు జిల్లాలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్ రెడ్డి తెలిపారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94943 45471, 79811 96060 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

9న 104 వాహనాల వేలం

నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పదకొండు 104 స్క్రాప్ వాహనాలను ఆన్‌లైన్ పద్ధతిలో ఈ నెల 9న వేలం వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోగా ఈఎండీ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.auction.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

10 మండలాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ



మిర్యాలగూడలో చీరలు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నల్లగొండ టూటౌన్ : జిల్లా వ్యాప్తంగా 10 మండలాల్లో 20745 మందికి బతుకమ్మ చీరలను బుధవారం పంపిణీ చేశారు. ఈనెల 4వ తేదీ నుంచి జిల్లా అంతటా బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. కాగా కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాల్సి ఉంది. ఎమ్మెల్యేలు కొందరు నేడు, రేపు సమయం ఇవ్వడంతో ఆయా మండలాల్లో సంబంధిత అధికారులు బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి (నల్లగొండ) : నల్లగొండ జిల్లాలోని ఎస్సీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్సీఓ అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ అసిస్టెంట్లు 2, కంప్యూటర్ అసిస్టెంట్ 1 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 5 నుంచి 10వ తేదీలోపు నల్లగొండ ఆర్సీఓ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08682 223898ను సంప్రదించాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సీమ

పెద్దవూర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ సీమ అన్నారు. బుధవారం పెద్దవూర మండలంలోని లింగంపల్లిలో నాబార్డ్ ఆధ్వర్యంలో పెద్దవూర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో సభ్యత్వం ఉన్న రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పంటను రైతులే నేరుగా మార్కెట్‌కు ఎగుమతి చేసుకుని అధిక రేటు పొందవచ్చని.. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నేరుగా కంపెనీల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి రైతులకు మట్టి పరీక్ష యంత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, ప్రొఫెసర్‌లు డాక్టర్ ఆర్.మధుబాబు, వి.రవీందర్ నాయక్, కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్త రాములమ్మ, డాక్టర్ మంగళదీప్, రూపాని రమేష్, ఎఫ్‌పీఓ చైర్మన్ సోమా కృష్ణమూర్తి, సోమా పవన్‌కుమార్, సీఈఓ ఆవుల జానారెడ్డి, మట్టపల్లి అంజిరెడ్డి, చీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు

సీసీఐ సన్నద్ధం



పెద్దవూర మండలంలో కాయ దశలో ఉన్న పత్తి చేను

- 40 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా
- 25 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు
- ఆధార్ అనుసంధానం ఉంటేనే కొనుగోలు
- ఇటీవల కురిసిన వర్షాలకు ఏపుగా పెరిగిన పత్తి చేలు
- ఈ నెలాఖరులో ప్రారంభం కానున్న పత్తి తీత పనులు

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ పత్తిని కొనుగోలు చేయడానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సన్నద్ధమవుతోంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ప్రస్తుత వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 5,66,922 ఎకరాల్లో పత్తి సాగైంది. 40 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖతో పాటుగా జిల్లా మార్కెటింగ్ శాఖ అంచనాలు వేసింది. పత్తి చేలు ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కాయదశలో ఉండగా కొన్ని చోట్ల పత్తి కాయలు పగులుతున్న దశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి చేలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ఆనందంతో ఉన్నారు. నెలాఖరునాటికి పత్తి తీత మొదలై మిల్లులకు వచ్చే అకాశం ఉండడంతో కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లలో సీసీఐ తలమునకలైంది.

ప్రతి కేంద్రంలో బయోమెట్రిక్ యంత్రాలు

గతంలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత సీజన్‌లో సీసీఐ కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దత ధర పొందాలంటే రైతు ఆధార్ నంబర్ తన బ్యాంకు ఖాతాకు అనుసంధానం అయి ఉండాలి. ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం అయి ఉండాలి. ప్రతి కొనుగోలు కేంద్రంలో బయోమెట్రిక్ యంత్రాలు ఏర్పాటు చేస్తారు. ఆ బయోమెట్రిక్ యంత్రంలో రైతు వేలిముద్ర పెడితే.. ఆ రైతు వివరాలు అనుసంధానమైనట్లు చూపిస్తేనే పత్తిని కొనుగోలు చేస్తారు. లేకుండా కొనుగోలు చేయరు. రైతులు విధిగా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ నంబర్‌ను. అధార్ నంబర్‌కు ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020

జిల్లాలోని నల్లగొండ, మాల్, నకిరేకల్, చండూరు, శాలిగౌరారం, చిట్యాల, కొండమల్లేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని 25 జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేయడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం పత్తి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,020గా ఉంది. త్వరలో కలెక్టర్ ఆధ్వర్యంలో కొనుగోళ్లకు సంబంధించిన సమావేశం నిర్వహించి కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

గతేడాది తీవ్రంగా నష్టపోయిన రైతులు

గత వానాకాలం సీజన్‌లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీజన్‌లో సుమారు 45 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చినప్పటికీ సీసీఐ కొనుగోలు చేయలేదు. కేవలం ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు, వ్యాపారులు క్వింటాళ్లకు రూ.6500 నుంచిరూ.7500 వరకు చెల్లించి కొనుగోలు చేశారు. కానీ అంతకు ముందు సంవత్సరం ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేశారు. దీంతో గతేడాది రైతులు పత్తిని నిల్వ చేసుకుని ధర కోసం ఎదురుచూశారు. రెండు నెలల తర్వాత కూడా ధర పెరగకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



రైతులు విధిగా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలి. అదే విధంగా ఆధార్‌కు ఫోన్ నెంబర్ కూడా అనుసంధానం చేసుకోవాలి. అనుసంధానం చేసుకుంటేనే సీసీఐ పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. అనుసంధానం అయ్యిందో లేదో అనే విషయాన్ని ప్రతి రైతు మీసేవ కేంద్రాల్లో చెక్ చేసుకోవాలి. లేకపోతే అనుసంధానం చేయించుకోవాలి.

– శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి

మోదీ అనుమతి అవసరం లేదు

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : మంత్రి కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ అనుమతి అవసరం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి మోదీ తెలంగాణపై విషం కక్కారని ధ్వజమెత్తారు. వెంటిలేటర్‌పై ఉన్న బీజేపీని కాపాడుకోవడానికే ప్రధాని సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ, ఈడీని బీజేపీ తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఈ దేశంలో బీజేపీ చేసిన అన్యాయాలు, అక్రమాలు ఎన్నో ఉన్నాయన్నారు. వారసత్వ రాజకీయాలకు బీజేపీ పెట్టింది పేరని బీజేపీలో మంత్రుల కుటుంబాలకు చెందిన వారు అనేక మంది ప్రస్తుతం పదవుల్లో ఉన్నారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ విజన్ ఉన్న నాయకుడని భవిష్యత్‌లో తప్పకుండా ముఖ్యమంత్రి అవుతారని, అందుకు మోదీ సహకారం అవసరం లేదన్నారు. తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో రక్తం ఏరులైపారిందంటున్న మోదీ ఎక్కడ హింస జరిగిందో చెప్పాలన్నారు. తన పక్కన అవినీతిపరులకు చోటు లేదన్న మోదీ మీ పార్టీలోని కొందరు ముఖ్యమంత్రులు ఈడీ, సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారని గుర్తు చేశారు.

ఆరోగ్యశ్రీకి డిజిటల్ కార్డులు

- పాతవాటి స్థానంలో కొత్తవి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- గత నెల 13న ప్రారంభమైన ప్రక్రియ
- ఆరోగ్య మిత్రల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు



ఆరోగ్య శ్రీ డిజిటల్ కార్డులు

హాలియా: ఆరోగ్యశ్రీ పాత కార్డుల స్థానంలో కొత్తగా డిజిటల్ హెల్త్‌కార్డుల జారీ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగా గతనెల 13న ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్డు ద్వారా ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ సంయుక్త పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో కుటుంబానికి రూ. 5లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందనున్నాయి. తెల్లరేషన్ కార్డులు ఉన్న వారంతా ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు పొందుతున్నారు. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న 10,06,900 పాతకార్డుల స్థానంలో ఇప్పటి వరకు 3,68,365 డిజిటల్ కార్డులు జారీ చేశారు.

ఆరోగ్య మిత్రల ద్వారా నమోదు

డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియలో ఆరోగ్య మిత్రల సేవలను వినియోగిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పతులతో పాటు జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆహార భద్రత కార్డుకు ఆధార్ లింక్ చేయబడిన సెల్ నంబర్, ఇతర వివరాలను ఆరోగ్య మిత్రలకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆ తరువాత వారం, పది రోజుల్లో డిజిటల్ కార్డు జారీ అవుతోంది. తద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందడం సులువవుతోందని అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనం ఇలా..

కొత్తగా జారీ చేస్తున్న డిజిటల్ హెల్త్ కార్డుల వల్ల ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళ్లినప్పుడు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తవుతుంది. ప్రస్తుతం ఉన్న కార్డులో కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటున్నాయి. డిజిటల్ కార్డు మాత్రం అందరికీ వేర్వేరుగా జారీ చేస్తారు. తద్వారా వివరాల నమోదు సులువవుతుంది. ఈ కార్డుపై బార్‌కోడ్ క్యూఆర్ కోడ్ ఉండడం స్కైప్ చేయగానే వివరాలు వెల్లడై త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి చికిత్స ప్రారంభిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల వివరాలు

జిల్లా	పాతవి	జారీచేసిన డిజిటల్ కార్డులు
నల్లగొండ	4,66,310	1,68,906
సూర్యాపేట	2,16,260	1,06,641
యాదాద్రి	3,24,330	92,818
మొత్తం	10,06,900	3,68,365

1,672 రకాల వైద్యసేవలు..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ బిల్లులు పేరుకుపోవడంతో చికిత్స చేయడానికి సుముఖత చూపడం లేదు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం వైద్య సేవలు మెరుగయ్యాయి. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 1,672 రకాల వైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తుండటంతో ఎక్కువ మంది ఈ పథకాన్ని ఎంచుకుంటున్నారు. అయితే, పాత కార్డులు కొన్ని చోట్ల పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అందరూ డిజిటల్ కార్డులు తీసుకోవాలి



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ డిజిటల్ హెల్త్ కార్డులను ప్రతిఒక్కరూ తీసుకోవాలి. ఆహార భద్రత కార్డుతో ఆధార్ లింక్ చేయబడిన సెల్ నంబర్, ఇతర వివరాలు సమీప ఆస్పత్రిలోని ఆరోగ్య మిత్రకు ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తరువాత హెల్త్‌కార్డు జారీ అవుతోంది.

– నేతి నాగరాజు కుమార్, ఆరోగ్య శ్రీ, ట్రస్ట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మేనేజర్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి



ఆర్డీఓగా దామోదర్‌రావు చేత బాధ్యతలు స్వీకరింపజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

చండూరు : మునుగోడు ఎంతో వెనుకబడిన ప్రాంతమని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తున్నామని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చండూరులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభోత్సవం, గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు సామగ్రిని అందించారు. బంగారిగడ్డ నుంచి కొండమల్లేపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్న లక్ష్యం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఉద్యమ సమయంలో ఊరూరా తిరిగి ఫ్లోరోసిస్‌ను గుర్తించిన కేసీఆర్ అధికారంలోకి రాగానే జిల్లా నుంచే కాదు రాష్ట్రం నుంచి తరిమికొట్టారని అన్నారు. 2018లో మునుగోడు అభివృద్ధి ఆగిందని ఈ 10 నెలల కాలంలో రూ.570 కోట్లతో ఎన్నో పనులు చేపట్టామన్నారు. చండూరులో రెవెన్యూ డివిజన్ అవసరమని ఆనాడే ప్రకటించామని.. ఇప్పుడు కావాలని డివిజన్ ఏర్పాటుపై కొంత మంది చిల్లర రాజకీయాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కార్యక్రమంలో గీత కార్మిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, శ్రీనివాస్, నూతన ఆర్డీఓ దామోదర్‌రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, ఎంపీపీ పల్లె కళ్యాణి, మెండు మోహన్‌రెడ్డి, శ్వేతారవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, పాశం సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్డీఓగా దామోదర్‌రావు

చండూరు నూతన ఆర్డీఓగా దామోదర్ రావును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఆయనను మంత్రి జగదీష్‌రెడ్డి.. బాధ్యతలు స్వీకరింపజేశారు. ప్రస్తుతం ఆయన మునుగోడు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కొనసాగుతున్నారు. గతంలో 2011 సంవత్సరంలో ఇక్కడే తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

పని చేసే ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలి



గుడిపల్లిలో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాన్నే రానున్న ఎన్నికల్లో ఎన్నుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటైన గుడిపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో మంత్రి మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న గుడిపల్లి మండలాన్ని అదే ఐక్యతతో అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా సంస్కరణలు తెలంగాణ అభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. అనంతరం మూడు వేల మందికి భోజనాలు ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్‌ని అభినందించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఆర్డీఓ శ్రీరాములు, గుడిపల్లి మండల సాధన కమిటీ చైర్మన్ మునగాల అంజిరెడ్డి, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, వైస్‌ఎంపీపీ అర్వపల్లి సరితానర్సింహ, సర్పంచ్ శీలం శేఖర్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్, నాయకులు చంద్రారెడ్డి, ఎర్ర వెంకటేశ్వర్లు, వట్టెపు గోవర్ధన్, పరమేష్, సైదులు పాల్గొన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్ బీజేపీ విజయం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

నల్లగొండ : కృష్ణానదీ జలాల కేటాయింపునకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు విధి విధానాలను రూపొందించాలని కోరుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదేళ్లపాటు దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం సిగ్గు లేకుండా నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌ను తమ విజయంగా చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. దక్షిణ తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన మోదీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో కృష్ణా నదిలో న్యాయమైన నీటి కేటాయింపుల ద్వారా నాగార్జునసాగర్ చివరి ఆయకట్టుకు సైతం సాగు నీరందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా ఏర్పాటు ఉద్యమానికి సహకరించాలి



మాట్లాడుతున్న కంకణాల శ్రీధర్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు కోసం జరుగుతున్న ఉద్యమంలో స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ వద్ద జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు దీక్షలకు ఆయన హాజరై మాట్లాడారు. మిర్యాలగూడ జిల్లా ఏర్పాటయితే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొండేటి సరిత, నియోజకవర్గ ఇన్‌చార్జి బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, తదితరులున్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల చాక్‌డౌన్



పెద్దవూరలో పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

- వేతనం పెంచి.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- విధులకు హాజరవుతూనే నిరసన
- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నిలిచిన బోధన

నల్లగొండ: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధులకు హాజరవుతూనే చాక్‌డౌన్ నిర్వహిస్తున్నారు. వేతనాలు పెంచి.. ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో పది రోజుల నుంచి వారు పాఠశాలలకు వెళ్తూనే చాక్‌డౌన్ నిర్వహిస్తుండడంతో ఆశ్రమ పాఠశాలల్లో బోధన నిలిచిపోయింది.

2015లో నియామకం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బోధన కోసం ప్రభుత్వం 2015లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 ఆశ్రమ పాఠశాలల్లో 74 మంది పనిచేస్తున్నారు. అయితే ఇన్‌స్ట్రక్టర్లుగా నియమితులైన వారికి మొదట నెలకు రూ.5 వేల వేతనం ఇవ్వగా.. 2019లో రూ.12 వేలకు పెంచారు. కరోనా సమయంలో వారి పోస్టులను విద్యా వలంటీర్లుగా మార్చారు. ఆ తర్వాత ప్రభుత్వం పాఠశాలల్లో విద్యా వలంటీర్ వ్యవస్థను రద్దు చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని రెన్యువల్ చేయడం లేదు. దీంతో వారు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి తమ ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు వారిని రెన్యువల్ చేయలేదు.

ఆశ్రమ పాఠశాలల్లో బోధకులు వీరే..

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కరు మినహా అంతా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల చేతనే బోధన సాగుతోంది. కానీ వారికి వేతనాలు మాత్రం ఇవ్వడం లేదు. గతేడాది ఇన్‌స్ట్రక్టర్ల విన్నపాలతో ప్రభుత్వం వారికి నెలకు రూ.12 వేల చొప్పున వేతనాలు అందించింది. కానీ, ఈ ఏడాది ఇంతవరకు వారికి ఒక్క నెల వేతనం కూడా ఇవ్వలేదు. దీంతో వారు చాక్‌డౌన్ ద్వారా తమ నిరసన తెలుపుతున్నారు. సమస్యను పరిష్కరించే వరకు తమ నిరసన కొనసాగుతుందని ప్రభుత్వానికి స్పష్టం చేస్తున్నారు.


బోధన చేస్తున్నా.. స్వీపర్‌కు వచ్చే వేతనమే..



ఏళ్ల తరబడి ఆశ్రమ పాఠశాలల్లో బోధన చేస్తున్నాం. కానీ మాకు కనీస వేతనాలు ఇవ్వడం లేదు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న స్వీపర్‌కు వచ్చేంత వేతనమే మాకు ఇస్తున్నారు. చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– సురేందర్, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



మేము అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నాం. అయినా మాకు ఉద్యోగ భద్రత లేదు. వాస్తవంగా మేము కాంట్రాక్టు పద్ధతిన పనిచేయాల్సి ఉన్నా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా తీసుకున్నారు. ప్రస్తుతం విద్యా వలంటీర్ అని చెబుతున్నారు. దీనివల్ల మాకు వేతనాలు రావడం లేదు. ఈ ఏడాది రెన్యువల్ కానున్నా పాఠశాలలకు వెళ్లి విధులు నిర్వహిస్తూనే ఉన్నాం.

– షబ్బీర్, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్, తిప్పర్తి ZPTC గా॥ శ్రీ పాశం రాంరెడ్డి గారికి ఇవే మా హృదయపూర్వక స్వదేశాగమన శుభాకాంక్షలు

ADVT Spl Feature















